

పోలీస్ సేవలు భేష్

పూర్ణామార్కెట్ వద్ద కృత్రిమ బస్టాప్ ఏర్పాటు

ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ చేయలేని పనిని వన్‌టౌన్ పోలీసులు చేసి ప్రయాణికుల కష్టాలు తీర్చారు. వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు పూర్ణామార్కెట్ వద్ద ప్లాస్టిక్ డివైడర్లు పెట్టి, తాళ్లు కట్టి బస్సులు ఆగే వీలు కల్పించారు. జగదాంబ నుంచి వన్‌టౌన్‌కు వచ్చే బస్సులు ఎడమ పక్క డివైడర్ వద్ద ఆగేలా ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు తగ్గడంతో పాటు రద్దీ కూడా నియంత్రించబడిందని ప్రయాణికులు పోలీసుల సేవలను కొనియాడుతున్నారు. - జగదాంబ

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కుటుంబం చెంతకు యువకుడు



ప్రహ్లాద్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం: ఒడిశా రాష్ట్రం, కోరాపుట్‌కు చెందిన ప్రహ్లాద్ కనముండా (26) పని కోసం విశాఖ వచ్చి మతి స్థిమితం కోల్పోవడంతో తిరిగి ఊరు వెళ్లలేకపోయాడు. కాన్వెంట్ జంక్షన్‌లో అటుగా వెళ్తున్న హార్బర్ కానిస్టేబుళ్లు బి. కనక రాజు, పీఏ స్వామి ఆగస్టు 14న మిషన్ జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగంగా అతన్ని ఏయూటీడీ జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌కు అప్పగించారు. అతను కోలుకోవడంతో కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్న ఏయూటీడీ ప్రతినిధులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ప్రహ్లాద్ బావ ధనర్జయ్ కీర్స రావడంతో అతనికి ప్రహ్లాద్‌ను అప్పగించినట్లు కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

లేపాక్షి డిస్కౌంట్ సేల్‌కు విశేష స్పందన



కళాకృతులను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు

దాబాగార్డెన్స్: ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఎం.విశ్వా ఆదేశాల మేరకు నగరంలోని లేపాక్షి షోరూమ్‌లలో ప్రత్యేక ఫెస్టివల్ డిస్కౌంట్ సేల్‌కు విశేష స్పందన వస్తోందని విశాఖ శాఖ మేనేజర్ తెలిపారు. ఫెస్టివల్ డిస్కౌంట్ సేల్ అక్టోబర్ 2 వరకు ఉంటుందని చెప్పారు. ఫెస్టివల్ సందర్భంగా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్‌పై 10 శాతం తగ్గింపు, అన్ని హ్యాండీక్రాఫ్ట్స్‌పై 15 శాతం తగ్గింపు, ముత్యాలు, ఆభరణాలు, గంధపు చెక్క, అగరబత్తి, ధూపం, రుద్రాక్ష, పూజా వస్తువులపై 10 నుంచి 15 శాతం తగ్గింపు, ఎంపిక చేసిన కొన్ని క్రాఫ్ట్స్‌పై 20 శాతం ప్రత్యేక ప్రమోషనల్ డిస్కౌంట్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, వుడ్ కార్వింగ్స్, కలంకారీ చీరలు, బెడ్‌షీట్స్, వరంగల్ పత్తి దుర్రీలు, రాగి విగ్రహాలు, లోహ కళాఖండాలు, జైపూర్ ఉడ్ ఆర్టికల్స్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. జగదాంబ జంక్షన్, రామ్‌నగర్ వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు విశాఖ ఎయిర్‌పోర్టు షోరూంలో ఈ ఉత్పత్తులు లభ్యమవుతాయని చెప్పారు.

ఘనంగా వైఎంసీఏ వార్షికోత్సవం

ఏయూ క్యాంపస్: బీచ్ రోడ్డులోని వైఎంసీఏ 50వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా విజయ ప్రధాన్, ఉపాధ్యక్షులుగా సదానంద మూసేస్, డైసీ బాబు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జి.మ్యాథ్యూ పీటర్, కోశాధికారిగా కె.ఇజ్రాయిల్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కృపాధాను కుమార్ వ్యవహరించారు.

దుర్గాదేవికి పట్టువస్త్రాల సమర్పణ



అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న మన్యాల

దాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ జంక్షన్ శ్రీకృష్ణ చైతన్య మఠం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలలో సంఘ సేవకుడు మన్యాల శ్రీనివాస్ దంపతులు ధన సహాయం చేసి, పట్టు వస్త్రాలు అందజేశారు.



జిల్లా పరిషత్ సమీపాన మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ వద్ద పైప్ లైన్ లీక్ కారణంగా వృథాగా పోతున్న తాగునీరు



రామకృష్ణా జంక్షన్‌లో చిన్నపాటి వర్షానికే జలమయమైన రహదారి



గతుకులమయంగా ఉన్న రైల్వే రిజర్వేషన్ కార్యాలయం నుంచి దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహ కూడలికి వెళ్లే రహదారి



కేజీహెచ్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలో ఇదీ పరిస్థితి..

సమస్యలతో సహవాసం

- దక్షిణలో ఎక్కడ చూసినా మురుగు.. పైప్‌లైన్ల లీకులతో ఇక్కట్లు
- ఇళ్లలోకి వస్తున్న కలుషిత జలం
- రోగాలపాలవుతున్న ప్రజలు

దాబాగార్డెన్స్:

దక్షిణ నియోజకవర్గ పరిధిలో నిత్యం ఏదో ఒక చోట భూగర్భ డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి.. శిథిల పైప్‌లైన్ల నుండి తాగునీరు వృథాగా పోతోంది. చెంగల్రావుపేట బజారు వద్ద భూగర్భ డ్రైనేజీ వీధి మధ్యలోనే పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడ పలు మార్లు మరమ్మతులు చేపట్టినా ఫలితం కనిపించలేదు. జిల్లా పరిషత్ జంక్షన్ రెడ్‌క్రాస్ సొసైటీ వద్ద కూడా ఇదే తంతు. ఇదిలా ఉండగా ఏ చిన్నపాటి వర్షం కురిసినా లోతట్టు ప్రాంతాలైన పూర్ణామార్కెట్, రామకృష్ణా జంక్షన్, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పెరికివీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న పలు భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతం కాల్వల్లో చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, వైద్య పరికరాలకు సంబంధించి వినియోగించి వదిలేసిన వస్తువులు అడ్డు తగిలితే ఎగువ ప్రాంతాల నుంచి కాల్వల ద్వారా వచ్చే మురుగు ఒక్కసారిగా ఉప్పొంగి జంక్షన్ అంతా వరదతో దర్శనమిస్తోంది. పాదచారులు, వాహన చోదకులు ప్రయాణించే వీల్లేకుండా ఉంది.



చెంగల్రావుపేట పంజా జంక్షన్ వద్ద ప్రవహిస్తున్న మురుగునీరు

పర్యాటకులకు మురుగు తాకిడి..

అందమైన విశాఖ బీచ్ పర్యాటకులకు మురుగు తాకిడి ఎక్కువైంది. కోస్టల్ బ్యాటరీ రోడ్డు నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లే బీచ్‌రోడ్డులోని రెండు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు బీచ్‌రోడ్డుపై ప్రవహిస్తోంది. పెద్ద కాల్వల్లో టన్నుల కొద్దీ పేరుకుపోయిన పూడికలు తీయకపోవడంతో మురుగంతా రోడ్లు, వీధుల్లోకి చొచ్చుకు వచ్చి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధ్వానంగా రోడ్లు..

నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. 31వ వార్డు రైల్వే రిజర్వేషన్ కేంద్రం నుంచి డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహ కూడలి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని పలువురు వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. 29వ వార్డు బుద్ధవరపు గార్డెన్స్ (సూర్య హాస్పిటల్ వెనుక రోడ్డు)లో రోడ్లన్నీ పాడై రాళ్లు తేలుతున్నాయి. దాదాపు ఐదారు నెలలుగా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఎక్కడికక్కడ పైపుల లీక్‌లు

నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పైపులైన్లు లీకవుతున్నాయి. జిల్లా పరిషత్ సమీపాన మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ వద్ద నిత్యం పైప్‌లైన్ లీక్ కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. అలాగే నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో తాగునీటి పైపులైన్లు మరమ్మతుకు గురి కావడంతో మురుగు నీరే తాగునీటి పైపుల ద్వారా ఇళ్లకు చేరుతోంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

స్వామి వివేకానంద సంస్థకు టెంట్, నిత్యావసరాల వితరణ



స్వామి వివేకానంద సంస్థకు టెంట్, నిత్యావసరాలు అందజేస్తున్న యాసీన్ బాబ్జీ

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు యాసీన్ బాబ్జీ స్వామి వివేకానంద సంస్థకు టెంట్, నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం అన్నదానాలు చేస్తున్న వివేకానంద సంస్థకు తన హైటెక్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా బియ్యం, నిత్యావసరాలతో పాటు, వర్షాల నేపథ్యంలో టెంట్ కూడా అందజేశామన్నారు. వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో బాబ్జీ ముందుంటారని తెలిపారు. ఇప్పుడు సంస్థకు శాశ్వతంగా టెంట్ బహూకరించిన నేపథ్యంలో బాబ్జీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

అల్లిపురం: మద్యం మత్తులో యువకుడిపై దాడి ఘటన మంగళవారం మధ్యాహ్నం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీవీసీఎం యర్రంనాయుడు తెలిపిన వివరాలు ఇలా.. అల్లిపురం యల్లపువారి వీధికి చెందిన సాహు అనే వ్యక్తి మౌర్య హోటల్ వద్ద మద్యం దుకాణం వద్ద జ్ఞానాపురానికి చెందిన సంతోష్ అనే వ్యక్తితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో సంతోష్ అతన్ని పక్కనే ఉన్న రాళ్ల కుప్పపై తోసేసి చాకుతో సాహుపై దాడికి పాల్పడ్డాడు. దీంతో సాహుకి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు పెంచాలని అద్దె బస్ డ్రైవర్ల ఆందోళన

దాబాగార్డెన్స్: అద్దె బస్ డ్రైవర్ల జీతాలు పెంచాలంటూ ఏపీఎస్ఆర్‌టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) మంగళవారం జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా సిటు జిల్లా కార్యదర్శి, ఏపీఎస్ఆర్‌టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వాల్తేర్ డిపో గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్రావు మాట్లాడుతూ వాల్తేర్, మద్దిలపాలెం, సింహాచలం ఆర్టీసీ డిపోల్లో అద్దె బస్సు డ్రైవర్లకు జీతాలు ఓనర్లు పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పంద కాలం పూర్తయి 11 నెలలు కావస్తున్నా జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. బస్సు పాస్ సౌకర్యం, ప్రమాదాలు జరిగితే అద్దె బస్సు డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవడానికి బీమా కల్పించాలన్నారు. ఈ నెల 15న సమ్మె నోటీస్ ఇచ్చామని, జీతాలు పెంచి, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట పడతామన్నారు. కార్యక్రమంలో సింహాచలం డిపో అద్దె బస్సు డ్రైవర్ల కార్యదర్శి సురేష్, వాల్తేర్, సింహాచలం, మద్దిలపాలెం డిపోల హైర్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆర్‌ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అద్దె బస్ డ్రైవర్లు

ముగిసిన రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు



మాట్లాడుతున్న రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ

తాటిచెట్లపాలెం: సోమవారం ప్రారంభమైన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 11వ ద్వైవార్షిక సమావేశాలు మంగళవారంతో ముగిసాయి. వర్కింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాలతో పాటు డెలిగేట్ సెషన్ కూడా జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రామిక్ కాంగ్రెస్ ఎల్లవేళలా కార్మికుల పక్షాన ఉంటుందని, అన్ని వేళల్లో ముందుండి నడిపించే నాయకుడు జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్ నాయకత్వంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో ట్రేడ్ యూనియన్‌లో నంబర్ -1గా నిలబెట్టారని ప్రశంసించారు. జోనల్ ప్రెసిడెంట్ జె. సంపత్‌కుమార్ మాట్లాడుతూ 8వ పే కమీషన్ ఏర్పాటు, అమలు, కరోనా సమయంలో 18 నెలల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని యాజమాన్యాన్ని కోరుతున్నట్లు తెలిపారు. మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్, విధి నిర్వహణ ప్రాంతాల్లో వాష్‌రూంలు, రెస్ట్‌రూంలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. రన్నింగ్ స్టాఫ్ ప్రధాన సమస్య మినిమం గ్యారంటీ కిలోమీటర్లపై యూనియన్ ఆమరణ దీక్షలు చేపట్టిందని, దీని ఫలితంగా అధికారులు, యాజమాన్యం చర్చించి సానుకూలంగా స్పందించినట్లు వీరు తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. నరసింగరావు, వాల్తేర్ డివిజన్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి. మాళీశ్వర్రావు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ వెంకట్రావు, కేంద్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరావు, ఆయా డివిజన్ల కేంద్ర కార్యవర్గ సభ్యు లు, యూనియన్ నాయకులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే చర్యలు



ఫిక్కీ ఫ్లో సభ్యులతో అతిథులు

తాటిచెట్లపాలెం: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఫ్లో సహకారంతో వాల్తేర్ డివిజన్ సాలగ్రామపురంలోని సాగరమాల ఆడిటోరియంలో ప్రత్యేక అవగాహన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా హాజరై మాట్లాడారు. మహిళా సిబ్బంది కోసం పలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు జరిగినా అందుకు కారకులను వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో గల పలు యూనిట్లలో మహిళలకు ప్రత్యేక రెస్ట్‌రూంలు, వాష్‌రూం, లాకర్స్, చేంజింగ్ రూంలు ఏర్పాటు చేయాలని సీనియర్ డీఈఎన్‌లను ఆదేశించినట్లు తెలిపారు. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ఈకార్వో ముందుంటుందని తెలిపారు. అంబ్రీన్ అంజుమ్ (ఫౌండర్, ఫిక్కీఫ్లో విజయవాడ చాప్టర్), డాక్టర్ వై. హేమ (మెంటార్, ట్రైనర్, ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్, పోష్), వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారి, రైల్వే ఉద్యోగులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

దుర్గాదేవికి భక్తుల ప్రత్యేక పూజలు

దాబాగార్డెన్స్:

కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం లలితాదేవిగా కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కట్టమూరి ప్రసన్న బృందంచే లలితాదేవి పారాయణం నిర్వహించారు. బుధవారం కన్యకాపరమేశ్వరి కాశీ అన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం పి.వెంకటలక్ష్మీ, రాధసుధ గ్రూప్‌చే అన్నమయ్య కీర్తనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంటక బాలాజీకుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దుర్గాలమ్మ..

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బుధవారం అన్నపూర్ణాదేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ..

అల్లిపురం: మంగళవారం దుర్గాదేవి, యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ, టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలోని ఉమాదేవి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



గాయత్రీదేవిగా దుర్గాలమ్మ అమ్మవారు



గాయత్రీ అవతారంలో సాగర గిరి కనకదుర్గమ్మ

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్‌కాలనీలో ఉన్న జిల్లా మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలు, గృహిణులకు పలు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం అక్టోబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డొమెస్టిక్ డాటా ఆపరేటర్, హ్యాండ్ ఎంబ్రైడరీ, అసిస్టెంట్ బ్యూటీథెరపిస్ట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. రెండు నెలల పాటు అందించే శిక్షణ పొందేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండడంతోపాటు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు గడువులోగా దరఖాస్తు చేస్తుకోవాలని ఆమె సూచించారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6281261415, 8333921389లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఏయూ చరిత్రను గ్రంథస్థం చేయాలి

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ చారిత్రక వికాసాన్ని గ్రంథస్థం చేయాలని కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ పబ్లిక్ గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వి.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలని సూచించారు. చరిత్రకారులు, విశిష్ట ఆచార్యులను సంప్రదించి ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రగతి, వికాసాలను గ్రంథంగా తీసుకొస్తే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా విశ్వవిద్యాలయాన్ని రానున్న 50 ఏళ్లలో ఏవిధంగా అభివృద్ధి చేయాలి.., ఏ దిశగా నడిపించాలనే అంశాలపై ఒక విజన్ సిద్ధం చేయాలని సూచించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఏయూ నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆచార్యులు నిరంతరం పరిశోధనలు జరపడం, పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించడం విధిగా భావించాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆచార్యులను ఉద్దేశించి శ్రీనివాస్ ప్రసంగించడం సంతోషకరమన్నారు. అనంతరం సత్కరించి జ్ఞాపిక అందజేశారు.



సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మహిళా కళాశాలలో ఆయుర్వేద దినోత్సవం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐక్యూఏసీ, వృక్షశాస్త్రం సంయుక్తంగా ఆయుర్వేద దినోత్సవం నిర్వహించాయి. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు–ప్రకృతికి–ఆయుర్వేదం పేరిట వృక్షశాస్త్రం విద్యార్థులు రూపొందించిన పోస్టర్ ప్రదర్శించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న వివిధ ఔషధ మొక్కలను గుర్తించి, వాటి ప్రాముఖ్యత వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ఆయుర్వేదం భారతీయ ప్రాచీన విజ్ఞాన శాస్త్రం, సాంప్రదాయ వైద్య విధానంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, బాటనీ విభాగాధిపతి డాక్టర్ టీఎంఎ నివేదిత, డాక్టర్ కిరణ్మయి, అరుణపద్మ, జి.మహాలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఔషధ మొక్కల ప్రాముఖ్యత వివరిస్తున్న విద్యార్థులు